
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 తమిళనాడు TAMILNADU

ఆదివారం 25 ఫిబ్రవరి 2024

4న నగరానికి మోదీ



చెన్నై, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ మార్చి 4వ తేదీ నగరానికి రానున్నారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండటంతో ఆయన రాష్ట్రంలో విస్తృతంగా ప్రచార సభల్లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 27, 28 తేదీలలో పల్లడం, మదురై, తూత్తుకుడి, తిరునల్వేలి నగరాల్లో సుడిగాలి పర్యటన జరిపి పలు సభల్లో మోదీ పాల్గొననున్నారు. 27న పల్లడంలో బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు అన్నామలై పాదయాత్ర ముగింపు సభలో ఆయన పాల్గొంటారు. అదే రోజు సాయంత్రం మదురైలో ఏర్పాటయ్యే కార్యక్రమంలో పాల్గొంటారు. రాత్రి మదురైలో బసచేస్తారు. ఆ సందర్భంగా పలువురు రాజకీయ ప్రముఖులతో ఆయన భేటీ అవుతారు. మరుసటి రోజు తూత్తుకుడి హార్బర్ ప్రాంగణంలో ఏర్పాటయ్యే ప్రభుత్వ కార్యక్రమంలో, కులశేఖరపట్టణం రాకెట్ ప్రయోగ కేంద్రం శంకుస్థాపనలో ఆయన పాల్గొంటారు. అదే రోజు సాయంత్రం తిరునల్వేలిలో ఏర్పాటయ్యే బహిరంగ సభలో ఆయన ప్రసంగించనున్నారు. ఆ నేపథ్యంలో మార్చి నాలుగున బీజేపీ కూటమి ఎన్నికల ప్రచార సభలో పాల్గొనే నిమిత్తం ఆయన చెన్నై రానున్నారు. నగరంలో ఏర్పాటయ్యే పార్టీ కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. ప్రధాని పాల్గొనే సభకు అనువైన రెండు ప్రాంతాల్లో ఒక దానిని ఎంపిక చేసేందుకు ప్రధాని భద్రతాదళం ఉన్నతాధికారులు రెండు మూడు రోజుల్లో నగరానికి చేరుకోనున్నారు. ప్రస్తుతం రాయపేట వైఎంసీఏ మైదానం, పల్లావరం ప్రాంతాలను అధికారులు పరిశీలిస్తున్నారు. ప్రధాని మోదీ నగరంలో పాల్గొనే బహిరంగ సభకు రాష్ట్రం నలుమూలల నుండి లక్షలాదిమంది పార్టీ శ్రేణులను తరలించేందుకు బీజేపీ రాష్ట్ర నాయకులు అప్పుడే ప్రయత్నాలు కూడా ప్రారంభించారు.

పటిష్ఠమైన భద్రత కల్పించండి

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అధికారులకు ఈసీ ఆదేశం



ప్రాంతీయ ఎన్నికల నిర్వహణాధికారులు, ఐఏఎస్ అధికారులతో సమావేశమైన కేంద్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి రాజీవ్‌కుమార్ తదితరులు

చెన్నై, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలకు పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని మూడు రాష్ట్రాల ఎన్నికల అధికారులు, పోలీసు ఉన్నతాధికారులకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి రాజీవ్‌కుమార్ ఆదేశాలిచ్చారు. లోక్‌సభ ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించేందుకు రాజీవ్‌కుమార్‌తోపాటు కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు ధర్మేంద్రశర్మ, నితీష్ వ్యాస్, డిప్యూటీ కమిషనర్లు అజయ్‌బాదు, మనోజ్‌కుమార్ సాహూల్, ప్రిన్సిపల్ సెక్రటరీ మల్లిక్ చెన్నైరు. శుక్రవారం ఉదయం రాష్ట్రంలోని డీఎంకే, అన్నాడీఎంకే సహా ప్రధాన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన వీరు ఎన్నికల ఏర్పాట్లపై చర్చలు జరిపారు. ఆ సందర్భంగా ప్రధాన పార్టీల ప్రతినిధులంతా లోక్‌సభ ఎన్నికలను ఒకే విడతగా జరపాలని ఎన్నికల సంఘం ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికలలో ఏ అభ్యర్థికి ఓటు వేశారో తెలిపే వీవీపాట్‌ను ఉపయోగించకూడదంటూ డీఎంకే డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో శనివారం కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు సమావేశమై తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల ప్రాంతీయ ఎన్నికల అధికారులతో చర్చలు జరిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, డీజీపీ శంకర్ జివాల్, రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి సత్యప్రద సాహూ తదితరులు హాజరయ్యారు. మూడు రాష్ట్రాల్లో లోక్‌సభ ఎన్నికలకు చేపడుతున్న చర్యల కోసం ఆయా రాష్ట్రాల ప్రాంతీయ ఎన్నికల అధికారులు వివరించారు. ఆ తర్వాత రెవెన్యూ, ఆదాయపు పన్ను శాఖల అధికారులు, కేంద్ర రిజర్వు పోలీసు దళం ఉన్నతాధికారులు తదితరులు సమావేశానికి హాజరై తమ ఏర్పాట్లను కేంద్ర ఎన్నికల సంఘం అధికారులకు తెలిపారు. చివరగా మధ్యాహ్నం రెండు నుంచి మూడు గంటల వరకు రాష్ట్ర డీజీపీ శంకర్‌జివాల్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనాతో కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష జరిపారు.

భారతదేశంలో వెస్ట్రన్ ఆస్ట్రేలియా వైద్యసేవల విస్తరణ



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వెస్ట్రన్ ఆస్ట్రేలియా ఆరోగ్యశాఖ మంత్రి అంబెర్ జేడ్ శాండర్‌సన్

చెన్నై, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలోని ప్రముఖ వైద్య సంస్థలతో వెస్ట్రన్ ఆస్ట్రేలియా ప్రభుత్వం భాగస్వామ్యం కుదుర్చుకుని వైద్యసేవలను విస్తరింపజేయనుందని ఆ ప్రభుత్వ ఆరోగ్యశాఖ మంత్రి అంబెర్ జేడ్ శాండర్‌సన్ తెలిపారు. నగరంలో శనివారం మధ్యాహ్నం మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ వైద్యనైపుణ్యాలపై సదస్సులు నిర్వహించేందుకు అపోలో ఆస్పత్రుల గ్రూపు భాగస్వామ్యం కుదుర్చుకుంటామన్నారు. అదే విధంగా ప్రస్తుతం నగరంలో జరుగుతున్న యుమేజిన్ చెన్నై 2024 సదస్సులో పాల్గొని తమ దేశంలో లభిస్తున్న వైద్య సేవలపై కీలకోపన్యాసం చేస్తామన్నారు. ఇదే విధంగా ఎంజీఎం ఆస్పత్రి, మద్రాసు మెడికల్ కాలేజీ, డాక్టర్ రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఆస్పత్రి, కావేరి ఆస్పత్రితోపాటు, నర్సింగ్ కాలేజీల్లోనూ ప్రసంగించనున్నామని వివరించారు. భారత ప్రభుత్వంతో కలిసి వైద్యసేవలందించే దిశగా ఈ నెల 22న ప్రారంభమైన తన సుహృద్భావ పర్యటన మార్చి 2 వరకు కొనసాగుతుందన్నారు. ఆ సందర్భంగా హైదరాబాద్, నాసిక్, త్రివేండ్రం నగరాల్లోనూ పర్యటించనున్నట్టు ఆమె పేర్కొన్నారు.





నెమ్మేలి నిర్లవణీకరణ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

ద్రావిడ తరహా పాలనలోనే దీర్ఘకాలిక పథకాల అమలు

సీఎం స్టాలిన్ ● నెమ్మేలి నిర్లవణీకరణ ప్లాంట్ ప్రారంభం

చెన్నై, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): గత మూడేళ్లుగా ద్రావిడ తరహా డీఎంకే పాలనలో ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనాలు కలిగించే పథకాలనే అమలు చేస్తున్నామని, ఆ దిశగానే రాజధాని నగరం చెన్నై నగరవాసులకు దాహార్తిని శాశ్వత ప్రాతిపదికన సముద్రపు నీటిని మంచినీరుగా మార్చే నిర్లవణీకరణ పథకాలను చేపడుతున్నామని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. తమది చేతల ప్రభుత్వమని, ఎన్నికల మేనిఫెస్టోలో లేని పథకాలను కూడా అమలు చేయడమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. చెంగల్పట్టు జిల్లా నెమ్మేలిలో చెన్నై నీటి సరఫరా సంస్థ ఆధ్వర్యంలో రూ.1516.కోట్లతో నిర్మించిన నిర్లవణీకరణ కేంద్రాన్ని శనివారం ఉదయం ఆయన ప్రారంభించారు. ఆ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ... నెమ్మేలి నిర్లవణీకరణ కర్మాగారంలో సముద్రపునీటిని మంచినీరుగా మార్చి రోజూ 150 మిలియన్ల లీటర్ల తాగునీటిని సరఫరా చేస్తామన్నారు. ఈ నిర్లవణీకరణ కేంద్రం నుంచి మంచినీటిని దక్షిణ చెన్నైలోని వేళచ్చేరి, ఆలందూరు, సెయింట్ థామస్‌మౌంట్, మేడవాక్కం, కోవిలంబాక్కం, నన్‌మంగళం, కీళ్‌కట్టలై, మూవరసన్‌పేట, చోళింగనల్లూరు, ఉల్లగరం- పుళిదివాక్కం, మడిపాక్కం, తాంబరం కార్పొరేషన్ పరిధిలో ఉన్న పల్లావరం, పాత పల్లావరం ఓఎమ్మార్ రోడ్డులోని ఐటి సంస్థ ప్రాంతాల్లోని 9లక్షల మందికి సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ప్రత్యక్షపద్ధతిలో చెన్నై నగర మేయర్‌గా రెండుసార్లు ఎన్నికైన తనకు నగరవాసుల ప్రధాన సమస్యలన్నీ బాగా తెలుసునని, ఆ దిశగానే సింగార చెన్నై పథకాలను అమలు చేస్తూ వచ్చామని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి తొలిసారిగా మీంజూరులో నిర్లవణీకరణ కర్మాగారాన్ని ప్రారంభించారని, ఆ తర్వాత తాను పురపాలక శాఖ మంత్రిగా ఉన్నప్పుడు నెమ్మేలి నిర్లవణీకరణ కర్మాగారానికి శంకుస్థాపన చేశానని, ప్రస్తుతం ఈ కర్మాగారం వల్ల నగరవాసులు మంచినీటిని ఇబ్బంది లేకుండా పొందుతున్నారని చెప్పారు. ఈ సభావేదికపై నుండే రాష్ట్రమంతటా రూ.948.18 కోట్లతో పూర్తయిన 95 పథకాలను ప్రారంచడం, రూ.1802.35 కోట్లతో చేపట్టనున్న 39 కొత్త పథకాలకు శంకుస్థాపన చేయడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఈవీ వేలు, దామో అన్బరసన్, కేఎన్ నెహ్రూ, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్.ప్రియ, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, కమిషనర్ డాక్టర్ జె.రాధాకృష్ణన్, ఎంపీలు సెల్వం, తమిళచ్చి తంగపాండ్యన్, శాసనసభ్యులు ఎస్ఎస్.బాలాజీ, ఎస్ఆర్.రాజా, ఇ. కరుణానిధి, తాయగమ్ కవి, వరలక్ష్మి మధుసూదనన్, బాబు, అరవింద్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తూత్తుకుడికి సీఎం స్టాలిన్

ప్యారీస్, ఫిబ్రవరి 24: తూత్తుకుడిలో ఆదివారం నిర్వహించనున్న ప్రభుత్వ వేడుకల్లో ముఖ్యమంత్రి స్టాలిన్ పాల్గొని, సుమారు 15,000 మంది లబ్ధిదారులకు సంక్షేమ పథకం కింద సహాయాలు పంపిణీ చేస్తారు. తూత్తుకుడి సమీపంలోని పుదుకోట సూసైపాండియాపురంలో ఉదయం 9.30 గంటలకు సుమారు 5 ఎకరాల విస్తీర్ణంలో 5,000 మంది కూర్చొనేలా వేదిక సిద్ధంచేశారు. ఇటీవల తూత్తుకుడి, తిరునల్వేలి జిల్లాల్లో సంభవించిన భారీ వర్షాల కారణంగా పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లు, పడవలు, ఇళ్లు కోల్పోయిన బాధితులు సుమారు 15 వేల మందికి సంక్షేమ సహాయాలను సీఎం స్టాలిన్ అందజేస్తారని కార్యక్రమ నిర్వాహకులు రాష్ట్ర మంత్రులు గీతాజీవన్, అనితా రాధాకృష్ణన్‌లు తెలిపారు.



మెరీనా తీరంలో పార్థసారథి పెరుమాళ్ ఉత్సవమూర్తికి తీర్థవారి నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా మాఘపౌర్ణమి

● వైష్ణవాలయాల్లో తీర్థవారి ఉత్సవం

ప్యారీస్, ఫిబ్రవరి 24: మాఘపౌర్ణమి పర్వదినం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం తెల్లవారుజాము నుంచే స్వామివార్లకు సుప్రభాత సేవ, మేల్కొలుపు, అర్చన అభిషేకాలు, పూజలను లోకకల్యాణార్థం నిర్వహించారు. ట్రిప్లికేన్‌లోని పార్థసారథి స్వామివారిని భక్తులు దర్శనం చేసుకునేందుకు బారులుదీరారు..అనంతరం ఆలయ అర్చకస్వాములు సుందరంగా అలంకరించిన పెరుమాళ్ స్వామివారిని గౌడ వాహనంలో వేంచేపు చేసి ఊరేగింపుగా సమీపంలో ఉన్న మెరీనా తీరానికి తరలించి తీర్థవారి నిర్వహించారు. భక్తుల గోవింద నామస్మరణ, మేళతాళాలు, వేదపండితుల మంత్రోచ్చారణ మధ్య పార్థసారథి పెరుమాళ్ ఉత్సవమూర్తులకు సముద్రపు నీటిలో తీర్థవారి నిర్వహించారు.

తిరుప్పోరూర్‌లో...

చెంగల్పట్టు జిల్లా తిరుప్పోరూర్‌లో ప్రసిద్ధిచెందిన కందస్వామి ఆలయ రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. మద్రాసు హైకోర్టు తీర్పు తరువాత ఉత్సవమూర్తి కందస్వామిని సుమారు 400 ఏళ్ల అనంతరం శుక్రవారం ఆదిద్రావిడులు నివసించే ప్రాంతంలో ఊరేగించారు. భక్తులు టపాసులు కాల్చి, మేళతాళాలతో స్వామివారి విగ్రహంపై పూలుచల్లి ఘనంగా స్వాగతించారు.



పల్లకీలో మెరీనా తీరానికి ఊరేగింపుగా వస్తున్న పార్థసారథి స్వామి ఉత్సవ మూర్తి

కమలం గూటికి కాంగ్రెస్ ఎమ్మెల్యే

● బీజేపీలో చేరిన విజయతరణి
● పార్టీ ఫిరాయింపు చట్టం కింద చర్యలు తీసుకుంటాం
● టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై హెచ్చరిక



బీజేపీ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్, కేంద్ర మంత్రి మురుగన్ సమక్షంలో ఆ పార్టీలో చేరిన విజయతరణి

ప్యారీస్, ఫిబ్రవరి 24: పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో, తమిళనాడు కాంగ్రెస్‌కి గట్టి దెబ్బ తగిలింది. ఆ పార్టీ విళవంగోడు నియోజకవర్గ మహిళా ఎమ్మెల్యే విజయతరణి శనివారం ఢిల్లీలో బీజేపీ పెద్దల సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు. కేంద్ర సహాయ మంత్రి డా.ఎల్.మురుగన్, ఆ పార్టీ కో-ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి, అరవింద్ మీనన్ తదితరులు పార్టీలోకి విజయతరణిని సాదరంగా ఆహ్వానించారు. కన్నియాకుమారి జిల్లా నుంచి కాంగ్రెస్ తరఫున విజయతరణి మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎంపికయ్యారు. స్వాతంత్ర్య సమరయోధుడు దేశీయ వినాయగం పిళ్లై మునిమనవరాలైన ఆమె రాష్ట్ర కాంగ్రెస్‌లో పలు కీలక బాధ్యతల్లో రాణించారు. బీజేపీలో చేరకముందు కాంగ్రెస్ బాధ్యతల నుంచి రాజీనామా చేస్తూ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేకు లేఖ రాసినట్లు ఆమె మీడియాకు వివరించారు. ఇదిలా ఉండగా, కాంగ్రెస్ పార్టీ పదవుల నుంచి ఆమె వైదొలగకముందే పార్టీ సాధారణ సభ్యత్వం నుంచి విజయతరణిని తొలగించినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్ ప్రకటించారు. ఇదిలా ఉండగా, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకపోవడంపై టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై మాట్లాడుతూ... ఎమ్మెల్యేగా ప్రజలకు ఎలాంటి మేలు చేయకపోయినప్పటికీ, విజయతరణికి పార్టీలో గౌరవం ఉండేదని, ఆమె బీజేపీలో చేరినందువల్ల 'ఇండియా' కూటమికి ఎలాంటి నష్టం లేదన్నారు. ఆమెపై పార్టీ ఫిరాయింపు చట్టం కింద చర్యలు తీసుకుంటామని, దీనిపై రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ అప్పావుకు పార్టీ తరఫున లేఖ అందజేశామని తెలిపారు. కాగా, కన్నియాకుమారి కాంగ్రెస్ ఎంపీ విజయ్‌వసంత్ మాట్లాడుతూ... పార్టీకి ద్రోహం తలపెట్టిన విజయతరణిని రాష్ట్రప్రజలు క్షమించబోరని, ఒకవేళ రాబోయే ఎన్నికల్లో బీజేపీ తరఫున రాష్ట్రంలో ఎక్కడ పోటీచేసినా ఆమెను ప్రజలే చిత్తుగా ఓడిస్తారని వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా, బీజేపీలో చేరిన విజయతరణి వైఖరి ఖండిస్తూ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కాంగ్రెస్ శ్రేణులు ఆమె దిష్టిబొమ్మ దహనం నిరసన వ్యక్తం చేశారు.

ఘనంగా జయ జయంతి

● సంక్షేమ సహాయాల పంపిణీ





అన్నాడీఎంకే ప్రచార ఆడియో క్యాసెట్ ఆవిష్కరిస్తున్న ఎడప్పాడి పళనిస్వామి, కేపీ మునుస్వామి తదితరులు - పార్టీ కార్యాలయంలో ఎంజీఆర్, జయలలితలకు నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్యారీస్, ఫిబ్రవరి 24: దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత 76వ జయంతిని అన్నాడీఎంకే శ్రేణులు శనివారం ఘనంగా జరుపుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ సహాయాలు, అన్నదాన, వస్త్రదాన కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్రప్రభుత్వం తరఫున మెరీనా బీచ్ రోడ్డు ఉన్నత విద్య మండ్రం ప్రాంగణంలో ఉన్న జయలలిత విగ్రహం ముందు ఏర్పాటుచేసిన ఆమె చిత్రపటానికి తమిళ అభివృద్ధి, సమాచార శాఖ కార్యదర్శి ఎల్.సుబ్రమణ్యన్, ఉన్నతాధికారులు నివాళులర్పించారు.

కేక్ కటింగ్...

రాయపేటలోని అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయం ఎంజీఆర్ మాళిగైలో పండుగ వాతావరణం కనిపించింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామికి కార్యకర్తలు, ప్రధాన నిర్వాహకులు స్వాగతం పలికారు. అనంతరం ఆ ప్రాంగణంలోని దివంగత ముఖ్యమంత్రులు ఎంజీఆర్, జయలలితల విగ్రహాలకు పళనిస్వామి పూలమాలలు వేసి పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. జయ జయంతి సందర్భంగా 76 కిలోల ప్రత్యేక కేక్‌ను ఆయన కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం అక్కడ ఏర్పాటుచేసిన వైద్యశిబిరాన్ని ఈపీఎస్ ప్రారంభించారు. అదే విధంగా, రక్తదాన శిబిరంలో వందలాది మంది కార్యకర్తలు రక్తదానం చేశారు. ఈ వేడుకల్లో పార్టీ ప్రిసీడియం ఛైర్మన్ తమిళ్‌మగన్ హుస్సేన్, కోశాధికారి దిండుగల్ శ్రీనివాసన్, ఉప ప్రధాన కార్యదర్శి కేపీ మునుస్వామి, డా.తంబిదురై, మాజీ మంత్రులు పి.వలర్మతి, ఎస్పీ వేలుమణి, సెంగోట్టయన్, డి.జయకుమార్, పి.బెంజిమెన్, సెల్లూరు రాజు, దళవాయి సుందరం, నత్తం విశ్వనాథన్, గోకుల ఇందిర, జిల్లా కార్యదర్శులు బాలగంగ, విరుదై రవి, టి.నగర్ సత్య, ఆర్ఎస్ రాజేష్, మాధవరం మూర్తి, టీజీ వెంకటేష్ బాబు, మాజీ కౌన్సిలర్ చిన్నయ్యన్ సహా యువజన, మహిళ, విద్యార్థి, వైద్యులు, న్యాయవాదులు, జయలలిత పేరవై తదితర అనుబంధ శాఖల నిర్వాహకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారం ఎప్పుడో ప్రారంభించాం:ఈపీఎస్

పార్లమెంటు ఎన్నికల సందర్భంగా అన్నాడీఎంకే తరఫున ఎన్నికల ప్రచారాన్ని ఎప్పుడో ప్రారంభించామని, కూటమికి సంబంధించి వచ్చే వదంతులు నమ్మరాదని, ఎన్నికల నోటిఫికేషన్ తర్వాతే పొత్తులపై నిర్ణయం ప్రకటిస్తామని పళనిస్వామి పేర్కొన్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత 76వ జయంతిని పురస్కరించుకొని ఆమె గత ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న దృశ్యాలు, ప్రసంగాలతో కూడిన వీడియోను ఈపీఎస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 'తమిళుల హక్కులు సాధిస్తాం-తమిళనాడును కాపాడుకుందాం' అనే టైటిల్‌తో ఆవిష్కరించిన అన్నాడీఎంకే ప్రచార వీడియోను రాష్ట్రంలోని అన్ని ప్రధాన నగరాలు, జిల్లా కేంద్రాలు, మారుమూల గ్రామాల్లో ప్రచారం చేసి ప్రజలకు అన్నాడీఎంకే ప్రభుత్వ విజయాల గురించి తెలియజేస్తామన్నారు. పార్లమెంటు ఎన్నికల బరిలో అన్నాడీఎంకేకు ప్రత్యర్థులే లేరని, ప్రజలు తమను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

సమాచార దృశ్మిని

టీఎన్‌పీఎస్సీ పరీక్షా ఫలితాల విడుదల

ఐసిఎఫ్, ఫిబ్రవరి 24: లైబ్రేరియన్ సహా వివిధ పోస్టుల భర్తీకి టీఎన్‌పీఎస్సీ నిర్వహించిన రాతపరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. గ్రంథాలయ శాఖలో 21 లైబ్రేరియన్ పోస్టులకు గత ఏడాది మేలో జరిగిన రాతపరీక్ష, గ్రూప్-7ఏ, జైలు శాఖ తదితర మూడు పరీక్షలు రాసిన అభ్యర్థుల మార్కుల జాబితా టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో విడుదలైంది. సర్టిఫికెట్ల పరిశీలన సంబంధించిన వివరాలను టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

210 మెగావాట్ల విద్యుదుత్పత్తికి అంతరాయం

ఐసిఎఫ్, ఫిబ్రవరి 24: ఉత్తర చెన్నై థర్మల్ విద్యుత్ కేంద్రంలో 210 మెగావాట్ల విద్యుదుత్పత్తికి అంతరాయం కలిగింది. అత్తిపట్టులో ఉన్న ఈ విద్యుత్ కేంద్రంలో తలా 210 మెగావాట్ల సామర్థ్యంతో మూడు యూనిట్లు పనిచేస్తున్నాయి. శుక్రవారం రెండో యూనిట్‌లో బాయిలర్ ట్యూబ్ పంక్చర్ కావడంతో ఉత్పత్తి నిలిచిపోయింది.

రేపు మాస్ వ్యవస్థాపక దినోత్సవం

ప్యారీస్, ఫిబ్రవరి 24: మద్రాసు ఆదిఆంధ్ర అరుంధతీయ ఆదివాసీ సంక్షేమ సంఘం (మాస్) ఆధ్వర్యంలో సోమవారం 28వ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించనున్నారు. ఎగ్మూర్‌లోని జీవనజ్యోతి కాన్ఫరెన్స్ హాలులో సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభం కానున్న ఈ వేడుకలకు మాస్ అధ్యక్షుడు డా.కొల్లి రాజు అధ్యక్షత వహిస్తారు. ముఖ్యఅతిథిగా తమిళనాడు ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి డా.ఐవీ మణివన్నన్, ప్రత్యేక అతిథులుగా ఆదాయపన్ను శాఖ జాయింట్ కమిషనర్ టీవీ అనీల్‌కుమార్, జీఎస్టీ అడిషినల్ కమిషనర్ మోహన్ గోపు, డిస్ట్రిక్ట్ రెవెన్యూ ఆఫీసర్ జీఆర్ దివ్యశ్రీ, టామ్స్ వ్యవస్థాపకులు గొల్లపల్లి ఇశ్రాయేల్ తదితరులు పాల్గొంటారని ఓ ప్రకటనలో తెలిపారు.

పాదరక్షల గది తొలగింపు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 24: స్థానిక మైలాపూర్ కపాలీశ్వర ఆలయంలో పాదరక్షల గదిని తొలగించారు. ఆలయ పశ్చిమ గోపురం సమీపంలో ఈ గది శిథిలావస్థకు చేరుకుంది. అలాగే, గోపురాన్ని ఆనుకొని కోనేరు ఉంది. తీర్థవారి కార్యక్రమాలు జరిగేటప్పుడు భక్తులు విడిచే పాదరక్షలు అంతరాయంగా ఉంటున్నాయి. దీంతో పాదరక్షలు భద్రతా గదిని ఆలయ నిర్వాహకులు తొలగించారు. భక్తులు దీనిపై నిరసన వ్యక్తం చేయడంతో త్వరలో తూర్పు రాజగోపురం సమీపంలో మరో పాదరక్షల గది ఏర్పాటుచేయనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

గుడువాంజేరి వరకు సబర్బన్ రైళ్లు

పెరంబూర్, ఫిబ్రవరి 24: కిళంబాక్కం బస్ టెర్మినల్‌కు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం చెన్నై బీచ్-తాంబరం సబర్బన్ రైళ్లు గుడువాంజేరి వరకు పొడిగించినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం, చెన్నై బీచ్ నుంచి తాంబరంకు రాత్రి 7.19, 8.15, 8.45, 8.55,. 9.40 గంటలకు బయల్దేరే సబర్బన్ రైళ్లు గుడువాంజేరి వరకు వెళతాయి. అలాగే, గుడువాంజేరి నుంచి రాత్రి 8.55, 9.45, 10.10, 10.25, 11.20 గంటలకు చెన్నై బీచ్‌కు సబర్బన్ రైళ్లు బయలుదేరుతాయి.

ఆదివారం...

ఆదివారం సెలవు రోజు కావడంతో చెన్నై బీచ్ నుంచి రాత్రి 7.20, 8.20, 8.40, 9, 9.50 గంటలకు గుడువాంజేరికి, గుడువాంజేరి నుంచి రాత్రి 8.55, 9.50, 10.10, 10.35, 11.20 గంటలకు చెన్నై బీచ్‌కి సబర్బన్ రైళ్లు బయల్దేరనున్నాయి. ఈ మార్పు సోమవారం నుంచి అమలుకు రానుందని దక్షిణ రైల్వే తెలియజేసింది.

అడవి ఏర్పాటుకు రూ.5 కోట్లు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 24: చెంగల్పట్టు జిల్లా సిరుచ్చేరిలో నగర ప్రాంత అడవి ఏర్పాటు కోసం సీఎండీఏ అటవీ శాఖకు రూ.5 కోట్లు కేటాయించింది. గత ఏడాది వివిధ అభివృద్ధి పథకాలను సీఎండీఏ ప్రకటించి అమలుపరుస్తోంది. పాత మహాబలిపురం రోడ్డులో ఉన్న సిరుచ్చేరిలో చిన్న అడవులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. అటవీ శాఖ హరిత సంస్థకు రూ.5 కోట్లను సీఎండీఏ అందజేయగా, త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

పారివాక్కం-కన్నపాళయం రోడ్డు పనులు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 24: స్థానిక పూందమల్లి సమీపంలోని పారివాక్కం-కన్నపాళయం రహదారి పనులు ప్రారంభమయ్యాయి. ఆవడి నుంచి ఆయిలచ్చేరి, కన్నపాళయం, పారివాక్కం మీదుగా పూందమల్లి వెళ్లే ప్రభుత్వ మినీ బస్సులు ఈ మార్గంలో నడుస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా రోడ్డు ధ్వంసం కావడంతో మరమ్మతులు శుక్రవారం ప్రారంభించారు.

రూ.1,000 కోట్లతో పైప్‌లైన్ల మరమ్మతులు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 24: నగరంలో రూ.1,000 కోట్లతో తాగునీటి పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టనున్నారు. పలు ప్రాంతాల్లో అక్కడక్కడా తాగునీటి సరఫరా పైప్‌లైన్లు ధ్వంసమై నీరు వృథాగా పోతోంది. వాటికి మరమ్మతులు చేపట్టేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

ఐయూఎంఎల్‌కు రామనాథపురం

- కొంగునాడు మక్కల్ కట్చికి నామక్కల్
- డీఎంకే నిర్ణయం

పెరంబూర్, ఫిబ్రవరి 24: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో డీఎంకే కూటమిలో సీట్ల సర్దుబాటు ప్రారంభమైంది. కూటమి పార్టీలైన ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్‌కు)కు రామనాథపురం, కొంగునాడు మక్కల్ కట్చికి నామక్కల్ నియోజకవర్గం కేటాయించినట్లు డీఎంకే ప్రకటించింది. గతంలో ఈ రెండు పార్టీలు ఈ రెండు స్థానాల్లో పోటీ చేశాయి. వాటిని మళ్లీ ఆయా పార్టీలకే అప్పగిస్తూ డీఎంకే నిర్ణయం తీసుకుంది. అదే విధంగా ఐయూఎంఎల్ తమ చిహ్నంపైనే పోటీ చేయనుండగా, కొంగునాడు మక్కల్ కట్చి మాత్రం డీఎంకే చిహ్నంపై పోటీ చేయనుంది. కాగా రామనాథపురం అభ్యర్థిగా నవాజ్ ఘనీ పోటీ చేయనున్నట్లు ఐయూఎంఎల్ ప్రకటించింది. ఆయన సిట్టింగ్ ఎంపీ అన్న విషయం తెలిసిందే.

నవగ్రహ క్షేత్రాల సందర్శనకు ప్రత్యేక బస్

- ప్రారంభించిన మంత్రి శివశంకర్

చెన్నై, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తంజావూరు జిల్లా కుంభకోణం, పరిసర ప్రాంతాల్లోని నవగ్రహ క్షేత్రాలను ఒకే రోజు సందర్శించేలా ఏర్పాటుచేసినప్రత్యేక బస్ సర్వీసును రాష్ట్ర రవాణా శాఖ మంత్రి శివశంకర్ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. కుంభకోణం నగరంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీలు కల్యాణసుందరం, రామలింగం, శాసనసభ్యుడు అన్బళగన్, డిప్యూటీ మేయర్ తమిళ్‌అళగన్ తదితరులు పాల్గొన్నారు. ఈ బస్సు శని, ఆదివారాల్లో ఉదయం ఆరు గంటలకు కుంభకోణం బస్ స్టేషన్ నుంచి బయలుదేరుతుంది. మొదట తింగలూరు చంద్రుడి దేవాలయం, తిరువారూరు జిల్లా ఆలంగుడి గురుభగవానుడి ఆలయం, ఆ తర్వాత తంజావూరు జిల్లా తిరునాగేశ్వరం రాహుభగవానుడి క్షేత్రం, సూర్యనార్‌కోవిల్‌లోని సూర్య దేవాలయం, కంజనూరు శుక్రభగవానుడి ఆలయం, మైలాడుదురై జిల్లా వైదీశ్వరన్ ఆలయంలోని అంగారకుడి ఆలయం, తిరువెంగాడు బుధభగవానుడి ఆలయం, కీళపెరుంపల్లంలోని కేతుభగవానుడి ఆలయం, తిరునల్లారు శనీశ్వరాలయానికి వెళుతుంది. ఈ బస్‌లో నవగ్రహ క్షేత్రాలను దర్శించడానికి భక్తులు టీఎన్‌ఎస్‌టీసీ.జీ అనే వెబ్‌సైట్ ద్వారా తమ టికెట్లను రిజర్వు చేసుకోవాలని మంత్రి శివశంకర్ పేర్కొన్నారు.



కుంభకోణంలో నవగ్రహక్షేత్రాల ప్రత్యేక బస్‌ను ప్రారంభిస్తున్న మంత్రి శివశంకర్

5,500 ఆలయాల్లో జీర్ణోద్ధరణ పనులు

- మంత్రి శేఖర్‌బాబు

ప్యారీస్, ఫిబ్రవరి 24: రాష్ట్రంలో ప్రసిద్ధిచెందిన 5,500 ఆలయాలకు మహా కుంభాభిషేకం నిర్వహించనున్న సందర్భంగా జీర్ణోద్ధరణ పనులు ప్రారంభించినట్లు దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు పేర్కొన్నారు. నుంగంబాక్కంలోని దేవాదాయ శాఖ ప్రధాన కార్యాలయంలో టీఎన్‌పీఎస్సీలో దేవాదాయ శాఖకు ఎంపిక చేసిన 75 మందికి శనివారం నియామక ఉత్తర్వులను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... దేవాదాయ శాఖలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పదోన్నతి 700 మందికిపైగా కల్పించామని, డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం 5,000 ఎకరాలకు పైగా ఆక్రమణలో ఉన్న ఆలయ భూములను విడిపించామని మంత్రి తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో కుల, ఆదాయ సర్టిఫికెట్లు

- మంత్రి అన్బిల్ మహేష్



పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్

పెరంబూర్, ఫిబ్రవరి 24: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ సర్టిఫికెట్లు అందజేసే ప్రక్రియల మరో నెల రోజుల్లో ప్రారంభించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ తెలిపారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో తమిళనాడు రాష్ట్ర తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమాఖ్య ఆధ్వర్యంలో కోయంబత్తూర్‌లో శుక్రవారం 'తల్లిదండ్రులతో జరుపుకుందాం' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి అన్బిల్ మహేష్ మాట్లాడుతూ... రాష్ట్ర బడ్జెట్‌లో పాఠశాల విద్యాశాఖకు రూ.44,042 కోట్లు కేటాయించారని, డీఎంకే అధికారం చేపట్టినప్పటి నుంచి పాఠశాల విద్యాశాఖకు మాత్రమే రూ.1,57,000 కోట్ల కేటాయించారని తెలిపారు. అలాగే, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించేలా నెలకు రూ.1,000 ప్రోత్సాహక నిధి అందించే పథకం అమలులో ఉందని తెలిపారు. పాఠశాలల అభివృద్ధికి 20 ఏళ్ల క్రితం విరాళాలు అందజేసిన వారిని సత్కరించనున్నామన్నారు. తిరుప్పూర్, నీలగిరి, ఈరోడ్, కోయంబత్తూర్ జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు రూ.448 కోట్ల విరాళాలందాయని తెలిపారు. పబ్లిక్ పరీక్షలు రాయనున్న విద్యార్థులు చదువులో శ్రద్ధ చూపాలని, పరీక్షలపై ఎలాంటి భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని మంత్రి విద్యార్థులకు సూచించారు.

'వీ లవ్ పీఎం మోదీ'...!

- విద్యార్థుల ఆహ్వానం



వీ లవ్ పీఎం మోదీ అక్షర నమూనాలో విద్యార్థులు

పెరంబూర్, ఫిబ్రవరి 24: తిరుప్పూర్‌కు రానున్న ప్రధాని మోదీని ఆహ్వానించేలా, 'వీ లవ్ పీఎం మోదీ' అనే ఆంగ్ల అక్షరాల నమూనాలో పాఠశాల విద్యార్థులు కూర్చుని ఆకట్టుకున్నారు. ఈ నెల 27న ప్రధాని మోదీ తిరుప్పూర్ జిల్లా పల్లడం సమీపం మాదపూర్‌లో జరుగనున్న బీజేపీ బహిరంగ సభలో పాల్గొననున్నారు. ప్రధానిని ఆహ్వానించేలా, చెట్టిపాళయం వివేకానంద పాఠశాలకు చెందిన 650 మంది విద్యార్థులు 'వీ లవ్ పీఎం మోదీ' అనే ఆంగ్ల అక్షరాల నమూనాలో కూర్చొని అందర్నీ ఆశ్చర్యపరిచారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నేతలు పాల్గొన్నారు.

గ్లెనగల్స్ హెల్త్‌సిటీ ఆధ్వర్యంలో బీఎల్‌ఎస్ ట్రైనింగ్ ప్రోగ్రాం



కార్యక్రమాన్ని ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

చెన్నై, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 'గ్లెనగల్స్ హెల్త్ సిటీ' ఆధ్వర్యంలో 'బేసిక్ లైఫ్ సపోర్ట్' (బీఎల్‌ఎస్) ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను ఆవిష్కరించింది. అత్యవసర పరిస్థితుల్లో సమర్థవంతంగా ప్రతిస్పందించడానికి వారు సిద్ధంగా వున్నారని నిర్ధారిస్తూ, అవసరమైన ప్రాణాలను రక్షించే నైపుణ్యాలతో సమాజంలోని సభ్యులను సన్నద్ధం చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యం. ఆసుపత్రి సీఈవో డాక్టర్ నాగేష్‌రావు, ఎమర్జెన్సీ విభాగాధిపతి డాక్టర్ శ్రీరాం రాజమణి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఇంకా కార్పొరేట్ రిలేషన్స్ హెడ్ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీ విజేతలకు బహుమతుల పంపిణీ



బహుమతులు అందజేస్తున్న ఏసీ షణ్ముగం

వేలూరు, ఫిబ్రవరి 24: పుదియ నీతి కట్చి ఆధ్వర్యంలో స్థానిక బాగాయం సీఎంసీ ఓవర్ మైదానంలో ఆనైకట్టు నియోజకవర్గ పరిధి క్రికెట్ పోటీలు ఈ నెల 19 నుంచి 21వ తేది వరకు జరిగాయి. ఈ పోటీల్లో 34 జట్లు పాల్గొనగా, ఓటేరికి చెందిన వేలూరు లెవెన్స్ విన్నర్‌గా, ఊసూరుకు చెందిన పెట్ బాయిస్ రన్నర్స్‌గా నిలిచాయి. అలాగే, ఉత్తమ ప్రదర్శన కనపరచిన వేలూరు లెవెన్స్‌కు చెందిన సతీష్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యారు. విజేతలకు పుదియ నీతి కట్చి అధ్యక్షుడు ఏసీ షణ్ముగం నగదు బహుమతి, ట్రోఫీలు అందజేశారు. ఏసీఎస్ కళాశాల అధ్యక్షుడు ఏసీఎస్ అరుణ్‌కుమార్ పోటీల ఏర్పాట్లు పర్యవేక్షించారు. కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఆదిద్రావిడ సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు జనరల్ నాలెడ్జికి చెందిన 100 పుస్తకాలు బహూకరించారు.

శ్రీసిటీలో జీటో ప్రతినిధుల బృందం



శ్రీసిటీ, ఫిబ్రవరి 24: చెన్నైలోని జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్(జేఐటీవో)కు చెందిన వంద మంది సభ్యుల యువ ఔత్సాహిక పారిశ్రామికవేత్తల ప్రతినిధి బృందం శనివారం శ్రీసిటీని సందర్శించింది. సంస్థ కన్వీనర్ నమన్ మునోత్ నేతృత్వంలో విచ్చేసిన బృందానికి శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) సి.రమేష్‌కుమార్ స్వాగతం పలికారు. ఇక్కడ వ్యాపారం చేయడం వల్ల కలిగే వివిధ ప్రయోజనాలను వారికి వివరించారు. శ్రీసిటీ సందర్శన ఏర్పాటు పట్ల జేఐటీవో ప్రతినిధి ప్రవేష్‌షా శ్రీసిటీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. టూత్ బ్రష్‌లు, టీ, కాఫీ, చాక్లెట్లు, కార్న్‌ఫ్లేక్స్, ఎఫ్ఎంసీజీ, మొబైల్ ఫోన్లు, ఏసీలు, కార్లు, మెట్రో రైళ్ల వంటి వివిధ రకాల ఉత్పత్తుల తయారీ గురించి తెలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. పర్యటనలో భాగంగా వీరు శ్రీసిటీ అధికారులతో సమావేశమై పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు. అనంతరం ఏఎల్ఎఫ్, రాక్‌వర్త్, జెడ్‌టీటీ తదితర పలు పరిశ్రమలను సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ సందర్శనకు వచ్చిన వారిలో మరింత మంది ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

బ్యాంక్ ఖాతాలో రూ.15 లక్షల కోసం ఎదురుచూపు

- డీఎంకే ఎంపీ కనిమొళి



పెరంబూర్, ఫిబ్రవరి 24: ప్రతి ఒక్కరి బ్యాంక్ ఖాతాలో రూ.15 లక్షలు జమచేస్తామన్న ప్రధాని మోదీ ఎన్నికల హామీ కోసం ఎదురుచూస్తున్నామని డీఎంకే ఎంపీ కనిమొళి ఛలోక్తి విసిరారు. ఈ మేరకు ఆమె విడుదల చేసిన ప్రకటనలో, డీఎంకే నియమించిన ఎన్నికల మేనిఫెస్టో కమిటీ ఈ నెల 5వ తేది నుంచి అన్ని వర్గాల ప్రజలు, వ్యాపారస్తులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, దివ్యాంగులు సహా అన్ని వర్గాల వారిని సంప్రదించి వారి అభిప్రాయాలు తెలుసుకుంటున్నామన్నారు. అలా సేకరించిన అభిప్రాయాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లిన అనంతరం ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేస్తామని, ప్రజల అభిప్రాయాలే డీఎంకే ఎన్నికల మేనిఫెస్టోగా ఉంటుందన్నారు. డీఎంకే ఎన్నికల హామీలు నెరవేర్చలేదని బీజేపీ నేత అన్నామలై విమర్శిస్తున్నారని, ఎన్నికల సమయంలో ప్రతి ఒక్కరి బ్యాంక్ ఖాతాలో రూ.15 లక్షలు జమచేస్తామని ప్రధాని మోదీ హామీ ఏమైందని ఆమె ప్రశ్నించారు. మరోవైపు డీఎంకే అబద్ధపు వాగ్దానాలు చేస్తోందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామి పేర్కొంటున్నారని, అన్నాడీఎంకే పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిందనే విషయాన్ని ఆయన గుర్తుచేసుకోవాలని కనిమొళి సూచించారు.

కుళచ్చల్‌లో చిలుక చేపల సీజన్ ప్రారంభం



కుళచ్చల్ రేవు వద్ద అమ్మకానికి సిద్ధంగా ఉన్న చిలుక చేపలు

చెన్నై, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లా కుళచ్చల్ వద్ద నెల రోజులుగా మందకొడిగా సాగిన చేపల వ్యాపారం శనివారం ఉదయం ఊపందుకుంది. రెండు రోజులకు ముందు నాలుగు మరపడవల్లో చేపలవేటకు వెళ్ళి జాలర్లకు సెమ్మీన్ అని తమిళంలో పిలుచుకునే చిలుక ఆకారంలో ఉన్న చేపలు పుష్కలంగా లభించాయి. శనివారం ఉదయం తీరానికి తిరిగొచ్చిన జాలర్లు బుట్టల కొద్దీ చిలుక చేపలను వేలం ప్రాంతంలో ఉంచారు. పావుగంటలోనే ఆ చిలుక చేపలను వ్యాపారులు వేలంలో సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా జాలర్ల సంఘం నాయకులు మాట్లాడుతూ.. కుళచ్చల్ తీరంలో ప్రస్తుతం చిలుక చేపల సీజన్ ప్రారంభమైందని, ఇప్పటివరకూ లభించని ఈ చేపలు ప్రస్తుతం విరివిగా లభించడం తమకు సంతోషంగా ఉందని, చెప్పారు. ఈ రకం చేపల కేజీ ధర రూ.180లు నుంచి రూ.200 వరకు ఉంటుందన్నారు. పేదల నుండి ధనవంతుల దాకా ఈ చిన్న రకం చిలుక ఆకారం చేపలను పోటీపడి కొనుగోలు చేస్తారని చెప్పారు.

కేక్‌తో జయలలిత చిత్రం తయారీ



కేక్‌తో తయారుచేసిన జయలలిత విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్యే శరవణన్

పెరంబూర్, ఫిబ్రవరి 24: దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత 76వ జయంతిని శనివారం రాష్ట్రవ్యాప్తంగా అన్నాడీఎంకే నేతలు, కార్యకర్తలు వేడుకగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పేదలకు సహాయాల పంపిణీ సహా పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ నేపథ్యంలో జయలలిత జయంతిని ప్రపంచ రికార్డుగా జరుపుకొనేందుకు , తిరుప్పరంగుండ్రం మాజీ ఎమ్మెల్యే శరవణన్ చర్యలు చేపట్టారు. 300 కిలోల బరువు, ఆరున్నర అడుగుల ఎత్తుతో కూడిన జయలలిత విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాన్ని పార్టీ కార్యకర్తలు, ప్రజలు ఆసక్తిగా చూశారు.

జయలలితకు ఘననివాళి



వృద్ధుల శరణాలయంలో స్వీట్లు అందజేస్తున్న నిర్వాహకులు

వేలూరు, ఫిబ్రవరి 24: వేలూరు నగర జిల్లా 47వ వార్డు కౌన్సిలర్, వేలూరు కార్పొరేషన్ ప్రతిపక్ష పార్టీ అధ్యక్షుడు ఎయిల్‌అరసన్ నేతృత్వంలో శనివారం దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత 76వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నాడీఎంకే జిల్లా సెక్రటరీ అప్పు నేతృత్వంలో వేలప్పాడిలోని వృద్ధుల శరణాలయంలో సరుకులు, స్వీట్లు పంపిణీ చేశారు.

ఘనంగా దళిత్ వెల్ఫేర్ ట్రస్ట్ వార్షికోత్సవం



బౌద్ధ భిక్షువులను అవార్డుతో సత్కరిస్తున్న బుద్దిస్ట్ జేపీ నాగభూషణం

ప్యారీస్, ఫిబ్రవరి 24: దళిత్ వెల్ఫేర్ ట్రస్ట్ 15వ వార్షికోత్సవం నగరంలో ఘనంగా నిర్వహించారు. ఎగ్మూర్‌లోని జీవనజ్యోతి హాలులో ట్రస్ట్ నిర్వాహకులు, బుద్దిస్ట్ జేపీ నాగభూషణం అధ్యక్షతన శుక్రవారం సాయంత్రం జరిగిన ఈ వేడుకల్లో పలు రాష్ట్రాలకు చెందిన బౌద్ధ భిక్షువులు ప్రకాశం, అమరావతి, జయశీలన్ తదితరులకు గౌతమ బుద్ధుడి పురస్కారాలు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు అంబేద్కర్ దాసన్, అరుళ్‌మోహన్, డా.రాజన్‌ధన్‌రాజ్, డా.నన్నారన్, డా.వి.శంకర్, డా.మహమ్మద్ సదతుల్లా, డా.అంబేద్కర్ జననాయక పేరపై నిర్వాహకులు కేసీ కొండయ్య, జోసఫ్, డి.భాగ్యలక్ష్మి తదితరులు ప్రసంగించారు. జేపీ నాగభూషణం మాట్లాడుతూ... సమాజాన్ని పట్టి పీడిస్తున్న మూఢనమ్మకాలకు స్వస్తి పలకాలన్న ఉద్దేశంతో తమ ట్రస్ట్ తరఫున ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నామని, గౌతమ బుద్ధుడి సిద్ధాంతాలు ప్రజల్లోకి తీసుకెళ్లి ఆరోగ్యవంతమైన సమాజం కోసం బౌద్ధ గురువుల సహకారంతో కృషిచేస్తున్నట్లు తెలిపారు.



శనివారం చెన్నైలో జరిగిన తమిళనాడు డాక్టర్ అంబేద్కర్ లా యూనివర్సిటీ 13వ స్నాతకోత్సవానికి రాష్ట్ర గవర్నర్ ఆర్‌ఎన్ రవి హాజరై విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర న్యాయశాఖ మంత్రి ఎస్.రఘుపతి, భారత అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి తదితరులు పాల్గొన్నారు.

సముద్రంలో విసిరేసిన బంగారం కోసం 3 రోజులుగా ముమ్మర గాలింపు



మన్నార్ జలసంధి ప్రాంతంలో స్కూబా డైవర్లతో గాలిస్తున్న అధికారులు

చెన్నై, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల క్రితం రామేశ్వరం సమీపం మండపం వద్ద మన్నార్ జలసంధికి చేరువగా వేదాలై అనే ప్రాంతం వద్ద నాటుపడవలో ప్రయాణించిన స్మగ్లర్లు సముద్రంలో విసిరేసిన పది కేజీల బంగారం కోసం కోస్ట్‌గార్డ్ అధికారులు ముమ్మర గాలింపు చర్యలు చేపడుతున్నారు. గత బుధవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు ఓ పడవలో సంచరిస్తున్నట్లు సమాచారం రావడంతో సముద్రతీర భద్రతాదళం అధికారులు హుటాహుటిన ఆ ప్రాంతానికి వెళ్లారు. వారిని చూసి పడవలో ఉన్న వ్యక్తులు కొన్ని సంచులను సముద్రంలో పారవేశారు. ఆ తర్వాత పడవలో నుండి సముద్రంలో దూకి పారిపోయారు. ఆ సంఘటనకు సంబంధించి ఇద్దరిని సముద్రతీర భద్రతా దళం అధికారులు నిర్బంధించారు. విచారణలో ఆ పడవలో అక్రమంగా తరలిస్తున్న సుమారు 10 కేజీల బంగారాన్ని సముద్రంలో విసిరేసినట్లు తెలుసుకున్నారు. దీంతో బుధవారం మధ్యాహ్నం నుండి కోస్ట్‌గార్డ్ అధికారులు స్కూబా డైవర్లను సముద్ర గర్భంలోకి పంపి బంగారం కోసం గాలింపు చర్యలు ప్రారంభించారు. ఈ గాలింపు చర్యలు శనివారం సాయంత్రం వరకూ కొనసాగింది. అయితే ఇప్పటి వరకూ బంగారం లభించలేదని అధికారులు తెలిపారు.

చెత్తకుండీలో మనిషి ఎముకలు

ప్యారీస్, ఫిబ్రవరి 24: స్థానిక తిరుమంగళం ప్రాంతంలో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాల సమీపంలో చెత్తకుండీలో పడేసిన మనిషి ఎముకలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం రాత్రి తిరుమంగళం ప్రాంతంలో ఉన్న బజారుకు వెళుతున్న స్థానికులు ఓ చెత్తకుండీ నుంచి దుర్వాసన వస్తుండడంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్కడకు చేరుకున్న పోలీసులు, చెత్తకుండీలో మనిషి పుర్రె, చేయి, కాలికి సంబంధించిన ఎముకలను గుర్తించి స్వాధీనం చేసుకుని, ఘటనపై విచారణ చేపట్టారు.

మృత్యువులోనూ వీడని బంధం

ప్యారీస్, ఫిబ్రవరి 24: స్థానిక కొళత్తూర్‌లో అనారోగ్యంతో భర్త మరణించడాన్ని జీర్ణించుకోలేక భార్య ఆత్మహత్య చేసుకున్న సంఘటన పలువురిని కంటతడి పెట్టించింది. పోలీసుల కథనం మేరకు... కొళత్తూర్ పుంపుహార్ నగర్ 24వ వీధికి చెందిన జగన్ (48) ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేశారు. ఆయన మహేశ్వరి (41)ని 14 సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నారు. వీరికి సంతానం లేకపోవడంతో మనస్తాపానికి గురైన జగన్ కొన్ని నెలల క్రితం అనారోగ్యానికి గురైనట్లు తెలిసింది. పెరియార్‌నగర్ ప్రభుత్వాసుపత్రికి శుక్రవారం ఉదయం తరలిస్తున్న సమయంలో మార్గమధ్యంలో జగన్ మృతి చెందాడు. ఈ విషయం తెలిసి మహేశ్వరి ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

బాణసంచా కర్మాగారంలో పేలుడు

- ఒకరి మృతి

పెరంబూర్, ఫిబ్రవరి 24: విరుదునగర్ జిల్లా సాతూర్ సమీపంలోని బాణాసంచా కర్మాగారంలో శనివారం సంభవించిన అగ్నిప్రమాదంలో ఒకరు మృతిచెందారు. సింతపల్లి గ్రామంలో ఉన్న ఈ బాణాసంచా కర్మాగారంలో టపాసుల తయారీకి మిశ్రమం కలుపుతున్న సమయంలో హఠాత్తుగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో అరుణాచలపురానికి చెందిన అజిత్‌కుమార్ (23) మృతిచెందాడు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జల్లికట్టు మృతుడికి ఆర్థికసాయం



మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న ఎంపీ కదిర్ ఆనంద్

వేలూరు, ఫిబ్రవరి 24: నాగనది గ్రామంలో జరిగిన జల్లికట్టు పోటీల్లో ఎద్దు పొడిచి రామ్ అనే యువకుడు మృతిచెందాడు. ఆయన మృతికి సంతాపం తెలిపిన ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, మృతుడి కుటుంబానికి ముఖ్యమంత్రి జనరల్ నిధుల నుంచి రూ.3 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. మృతుడి ఇంటికి శనివారం వెళ్లిన ఎంపీ కదిర్ ఆనంద్, జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి, మృతుడి కుటుంబసభ్యులకు చెక్ అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ ప్రొఫెసర్ మృతి



దేబాశిష్ తాండా (ఫైల్ ఫోటో)

వేలూరు, ఫిబ్రవరి 24: నగర సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మాజీ ప్రొఫెసర్ దేబాశిష్ తాండా మృతిచెందారు. సీఎంసీ వైద్యశాల రుమటాలజీ విభాగంలో 27 ఏళ్ల పనిచేసిన ఆయన పదవీవిరమణ పొందారు. ప్రస్తుతం బెంగుళూరులోని నారాయణ హెల్త్ ఇన్‌స్టిట్యూట్‌లో పనిచేస్తున్నారు. ఆయన భార్య డా.సుమితా తాండా సీఎంసీ వేలూరులో మెడికల్ జెనటిక్స్ విభాగ అధిపతిగా వ్యవహరిస్తుండగా, కుమారుడు ఆశీర్వాద్ తండా కళాశాల విద్య అభ్యసిస్తున్నాడు. ఆయన మృతికి పలువురు వైద్యులు, పుర ప్రముఖులు సంతాపం తెలిపారు.

బావిలో ఆటో బోల్తా : ఇద్దరు బాలుర మృతి

చెన్నై, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా కప్పై ప్రాంతం వద్ద బావిలో ఆటో బోల్తాపడటంతో నుంగంబాక్కంకు చెందిన ఇద్దరు బాలురు దుర్మరణం చెందగా ఏడుగురు గాయపడ్డారు. తిరువణ్ణామలై గిరి ప్రదక్షిణకు తల్లిదండ్రులు, బంధువులతో వెళ్లి తిరిగి వస్తుండగా వీరిద్దరూ మృత్యువాతపడ్డారు. నుంగంబాక్కం పుష్పానగర్‌కు చెందిన యువరాజ్ (40)సొంతంగా ఆటో నడుపుతున్నారు. శుక్రవారం సాయంత్రం తిరువణ్ణామలై గిరి ప్రదక్షిణకు భార్య సత్య (35), కుమారులు బృహదీశ్వరన్ (11), హరి ప్రసాద్ (7), బంధువులతో ఆటోలో వెళ్లారు. గిరి ప్రదక్షిణ ముగించుకుని స్వస్థలానికి ఆటోలో బయలుదేరారు. అందులో వీరితోపాటు యువరాజ్ బంధువులు ఉత్తరకుమార్, ఆయన భార్య సహా మొత్తం 9 మంది ప్రయాణించారు. ఆ ఆటో శనివారం వేకువజాము 2.30 గంటలకు కప్పై గ్రామంలోని రహదారి మలుపువద్ద ఆటో అదుపు తప్పి పక్కనే ఉన్న బావిలో పడింది. యువరాజ్, భార్యా బంధువులు సహా ఏడుగురు బావిలో నుండి మెట్లమీదుగా పైకి చేరుకున్నారు. అయితే యువరాజ్ కుమారులు బృహదీశ్వరన్, హరి ప్రసాద్. బావినీటిలో మునిగారు. సమాచారం అందుకుని హుటాహుటిన అక్కడికి చేరుకున్న పోలీసులు అగ్నిమాపక సిబ్బందితో బావిలోని బాలుర మృతదేహాలను వెలికి తీశారు. ఈ ప్రమాదంలో గాయపడిన యువరాజ్, బంధువులు సహా ఏడుగురిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.

పెళ్ళయిన ఐదోరోజే ఐటీ ఉద్యోగి ఆత్మహత్య

చెన్నై,ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి):కోయంబత్తూరు కుమారపాళయంలో నివసిస్తున్న ఐటీ ఉద్యోగి పెళ్ళయిన ఐదురోజులకే ఆత్మహత్య చేసుకున్నాడు. కుమారపాళయంకు చెదిన అశ్విన్ (27) చెన్నైలో ఐటీ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు.ఈనెల 19న తిరుప్పూర్‌జిల్లాకు చెందిన సస్మిత అనే యువతితో అశ్విన్ వివాహం జరిగింది. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి అశ్విన్ తన ఇంటిలో నిద్రపోయాడు. శనివారం వేకువజాము ఉన్నట్టుండి అదృశ్యమయ్యాడు. కుటుంబీకులు అతడికోసం వెదకగా ఆ ఇంటి పక్కనే ఉన్నమరో ఇంటిలో నేలపై తలచుట్టూ ప్లాస్టిక్ సంచిని బిగించుకుని అపస్మారక స్థితిలో పడి ఉండటం చూసి దిగ్భ్రాంతి చెందారు. వెంటనే అశ్విన్‌ను ఆస్పత్రికి తీసుకెళ్ళారు. వైద్యులు పరీక్షించి అప్పటికే అతడు ప్రాణాలు కోల్పోయినట్లు ప్రకటించారు. సుల్తాన్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.



చెన్నై పుళల్ కావాంగరైలో జయలలిత 76వ జయంతి సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో అన్నాడీఎంకే నాయకులు లయన్ జి.మురళి, వాసు తదితరులు



కులశేఖపట్టణం ఎస్ఎస్ఎల్వీ ప్రయోగ వేదిక నమూనా

SUNDAY SPECIAL

అంతరిక్ష పటంలో 'కులశేఖరపట్టణం'

- 'ఇస్రో'కు మరో వేదిక
- రూ.900 కోట్లతో నిర్మాణం
- 28న శంకుస్థాపన చేయనున్న ప్రధాని

అంతరిక్ష పటంలో కులశేఖరపట్టణం ప్రత్యేకత సంతరించుకోనుంది. 'ఇస్రో' రెండో ప్రయోగ వేదికకు తూత్తుకుడి జిల్లా కులశేఖరపట్టణంలో శ్రీకారం చుట్టింది. ఈ కేంద్రానికి ఈ నెల 28న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శంకుస్థాపన చేయనున్నారు. రెండేళ్లలో నిర్మాణాలు ముగించుకొని ఈ ప్రయోగ వేదిక తొలి రాకెట్‌ను అంతరిక్షంలోకి పంపనుందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

\- పెరంబూర్



శంకుస్థాపనకు సీఎం స్టాలిన్‌ను ఆహ్వానిస్తున్న ఇస్రో చైర్మన్ సోమనాథ్ (ఫైల్ ఫొటో)



ప్రయోగ వేదిక ఏర్పాటుకానున్న ప్రాంతం



ప్రయోగ వేదిక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ సోమనాథ్, శాస్త్రవేత్తల బృందం

ఇస్రో...

భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) అంతరిక్ష పరిశోధనల కోసం భారత ప్రభుత్వం నెలకొల్పిన సంస్థ. అంతరిక్ష విజ్ఞానాన్ని అభివృద్ధి చేసే ఉద్దేశంతో ఏర్పాటై ప్రస్తుతం ప్రపంచంలోని అగ్రగామి అంతరిక్ష సంస్థల్లో ఒకటిగా పేరుగాంచింది. ఇస్రోకు దేశంలోని వివిధ ప్రదేశాల్లో పరిశోధన, అభివృద్ధి సౌకర్యాలున్నాయి. వరుస ప్రయోగాలు విజయవంతం అవుతుండడంతో ఇస్రో మరింత ఆత్మవిశ్వాసంతో దూసుకెళ్తోంది. చంద్రుడి మీద 'చంద్రయాన్-3' ప్రయోగంలోని విక్రమ్ ల్యాండర్, సూర్యుడిపై పరిశోధనలకు ఆదిత్య ఎల్-2 తదితర ప్రాజెక్టులు విజయవంతంగా పూర్తిచేసిన ఇస్రో, తాజాగా అంతరిక్షంలోకి మానవులను పంపే ప్రాజెక్ట్‌ను ప్రతిష్ఠాత్మకంగా చేపడుతోంది. అయితే ఇస్రో ఇప్పటివరకు చేపట్టిన ప్రయోగాలన్నీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతి జిల్లా శ్రీహరి కోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచే చేపట్టింది. ఎందుకంటే ఇస్రోకి ఇదొక్కటే ప్రయోగ కేంద్రం ఉంది. ఇక్కడి నుంచి దేశీయ, విదేశీ ఉపగ్రహాలను విజయవంతంగా అంతరిక్షంలోకి పంపిస్తోంది. ఈ కేంద్రంలో లాంచ్ ప్యాడ్‌ల ద్వారా పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ అనే రెండు రాకెట్ లాంచింగ్ వెహికల్స్ ద్వారా ఉపగ్రహాలను ఇస్రో ప్రయోగిస్తోంది.

రెండవ ప్రయోగ వేదిక....

దేశంలో రెండవ ప్రయోగ వేదికకు కేంద్రప్రభుత్వం అనుమతివ్వడంతో, తూత్తుకుడి జిల్లా కులశేఖరపట్టణంలో రెండవ ప్రయోగ వేదిక ఏర్పాటుకు ఇస్రో సిద్ధమైంది. కులశేఖరపట్టణం, సాతాన్‌కుళం తాలూకాల్లోని పదుకపత్తు, పల్లకుర్చి, మాతవాన్‌కుర్చి తదితర గ్రామాల్లో 2,333 ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వం సేకరించి ఇస్రోకు అందజేసింది. కులశేఖరపట్టణంలోని ప్రయోగ వేదిక త్వరగా పూర్తిచేసి, అక్కడి నుంచి స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్స్ (ఎస్ఎస్ఎల్వీ) ప్రయోగాలు చేపట్టాలని ఇస్రో ప్రణాళికలు సిద్ధం చేసింది.

కులశేఖరపట్టణమే ఎందుకు...?

ఇస్రో రెండవ ప్రయోగ వేదికకు కులశేఖరపట్టణాన్ని ఎంపిక చేసేందుకు మూడు ప్రధాన కారణాలున్నాయని మాజీ శాస్త్రవేత్త ఇళంగోవన్ తెలిపారు. రాకెట్ ల్యాండ్ ప్యాడ్ అనేది భూమధ్యరేఖకు దగ్గరగా ఉండాలి. దక్షిణ ధృవంలోని కక్ష్యలోకి పంపే రాకెట్లను తూర్పు తీరం సమీపం నుంచే ప్రయోగించాల్సి ఉంది. అలాంటి సమయంలో భూమి తిరిగే వేగంలో 0.5 కి.మీ/సెకండ్ అదనపు వేగం లభిస్తోంది. ఉపగ్రహ ప్రయోగాల్లో ఇలాంటి వాటిని పరిగణలోకి తీసుకుంటే భారీ పెలోడ్‌లు కలిగిన రాకెట్లను కూడా సులభంగా ప్రయోగించవచ్చు. ఇందుకోసం చాలా దేశాలు తమ ఉపగ్రహాలను వేరే దేశాల నుంచి అంతరిక్షంలోకి పంపిస్తుంటాయి. ఉదాహరణకు... యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ తన ఉపగ్రహాలను ఫ్రాన్స్‌లోని గయానా స్పేస్ సెంటర్ నుంచి ప్రయోగిస్తోంది.

రెండవ కారణం...

అంతరిక్షంలోకి వెళ్లే రాకెట్లు నింగిలోకి ఎగిరి, తర్వాత వాటి నుంచి కొన్ని భాగాలు విడిపోయి కింద పడతాయి. ఈ విడిభాగాలు తప్పనిసరిగా సముద్రంలోనే పడాల్సి ఉంది. లేదంటే భారీ ఆస్తి, ప్రాణనష్టం కలుగుతుంది. అందువల్లే ప్రయోగ వేదికలు భూమధ్యరేఖకు, సముద్రతీరానికి సమీపంలో ఉండే విధంగా నిర్మాణాలు చేస్తారు. అయితే శ్రీహరికోటలో ప్రయోగించిన రాకెట్ల విడిభాగాలు పక్కనే ఉన్న శ్రీలంకలో పడకుండా అడ్డుకొనేలా ఇస్రో 'డాగ్లెగ్ మ్యాన్యువర్' అనే పద్ధతి పాటిస్తుందని ఇళంగోవన్ తెలిపారు.

మూడవ కారణం....

ఇస్రో కులశేఖరపట్టణాన్ని ఎంచుకోవడానికి మూడవ ప్రధాన కారణం గాలి. ప్రయోగ వేదికలు ఉండే ప్రాంతంలో గాలి వేగం గంటకు 30 కి.మీ కంటే తక్కువ ఉండాలి. అధిక గాలి ఉండడం వల్ల రాకెట్ ప్రయోగాలు చేపట్టే సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశముంది. అంతరిక్ష కేంద్రం వద్ద అల్పపీడన పరిస్థితులు ఏ మాత్రం ఉండకూడదు. అందువల్లే ప్రయోగ కేంద్రం ప్రాంతాన్ని ఎంపిక చేసే సమయంలో అనువైన వాతావరణ పరిస్థితులు ఉండేలా చూసుకోవడం చాలా కీలకమైన అంశం. పైన పేర్కొన్న మూడు లక్షణాలు కులశేఖరపట్టణంలో ఉండడంతో రెండవ ప్రయోగ వేదికకు ఇది ఉత్తమ ప్రదేశమని ఇస్రో నిర్ణయించింది.

ఇంధనం ఆదా...

భూమధ్యరేఖకు ఉత్తరాన 13.74 డిగ్రీల వద్ద శ్రీహరి కోట ఉండగా, భూమధ్యరేఖకు ఉత్తరాన 8.36 డిగ్రీల వద్ద కులశేఖరపట్టణం ఉంది. అందువల్లే కులశేఖరపట్టణం నుంచి రాకెట్లు నింగిలోకి ప్రయోగిస్తే ఇంధనం ఆదా అవుతుందని మరో శాస్త్రవేత్త నెల్లై ఎస్.ముత్తు తెలిపారు. అలాగే, శ్రీహరికోట నుంచి ప్రయోగించే రాకెట్లు శ్రీలంక దేశం మీద నుంచి ప్రయాణించకుండా, రాకెట్ విడిభాగాలు శ్రీలంకపై పడకుండా అడ్డుకొనేలా, ఆ రాకెట్లను తూర్పు వైపుకు ప్రయోగించి, ఆ తర్వాత దక్షిణ ధృవం దిశగా మళ్లిస్తుంటారు. అదే రాకెట్లను కులశేఖరపట్టణం నుంచి ప్రయోగిస్తే ఇలా చేయాల్సిన అవసరం లేకుండా నేరుగా దక్షిణం వైపే వాటిని ప్రయోగించవచ్చని ఆయన వివరించారు.

తగ్గనున్న వ్యయం... : రాకెట్లలోని క్రయోజనిక్ ఇంజన్లలో వాడే ద్రవ హైడ్రోజన్ తిరునల్వేలి జిల్లా మహేంద్రగిరిలోని ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్‌లో ఉత్పత్తి చేస్తారు. అలాగే, రాకెట్ విడిభాగాలు కేరళ రాష్ట్రం తుంబ పరిశోధన కేంద్రంలో తయారుచేస్తారు. వీటన్నింటినీ ప్రయోగ సమయంలో శ్రీహరికోటకు చేర్చడం కష్టతరమవుతోంది. భద్రతా సమస్యలు, తరలింపులో విడిభాగాలు దెబ్బ తినడం, అక్కడి నుంచి ఇక్కడకు రావడానికి సమయం ఆలస్యం కావడం తదితరాలు చోటుచేసుకుంటున్నాయి. అయితే శ్రీహరికోటతో పోల్చితే కులశేఖపట్టణం రెండింటికీ దగ్గరగా ఉండడంతో, తరలింపు కోసం వ్యయం తగ్గనుంది.

వాణిజ్యపరంగా లాభదాయకం...

కులశేఖరపట్టణం ప్రయోగ వేదిక నుంచి ఎస్ఎస్ఎల్వీలను ప్రయోగించాలని ఇస్రో ప్రణాళికగా ఉంది. చిన్న రాకెట్ భాగాలు తయారుచేసి, వాటిని అమర్చి ప్రయోగించడం సులభం అయినందున ఈ ప్రాంతంలో ప్రత్యేక కేంద్రం ఏర్పాటుచేయాలి, చిన్న ఉపగ్రహాలను కక్ష్యలోని ప్రవేశపెట్టడానికి పెద్ద రాకెట్లు తయారయ్యే వరకు ఎదురుచూడకుండా డిమాండ్‌ను బట్టి వాటిని ప్రయోగిస్తే వాణిజ్యపరంగా లాభదాయకంగా ఉంటుందని శాస్త్రవేత్త ముత్తు అభిప్రాయపడ్డారు.

దక్షిణ జిల్లాల అభివృద్ధి...

కులశేఖపట్టణం ప్రాజెక్ట్ రాష్ట్రంలోని దక్షిణ జిల్లాల ప్రజల జీవనోపాధి మెరుగుపరుస్తుందని ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం భావించి ఆ దిశగా, భూసేకరణ, ప్రాజెక్ట్ పూర్తయ్యేందుకు పూర్తిగా సహకరిస్తోంది. రాకెట్ల ప్రయోగం కోసం నిర్మిస్తున్న ప్రయోగ వేదిక సమీపంలో అంతరిక్ష పరిశ్రమ, ప్రొపెల్లంట్ పార్క్‌లు ఏర్పాటుచేయాలని రాష్ట్రప్రభుత్వం భావిస్తోంది. ఇలాంటి చర్యలతో ఇస్రోకు అవసరమైన వస్తువులు అందించడంతో పాటు ఆ ప్రాంత అభివృద్ధి, స్థానికులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెంపొందించాలని డీఎంకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

28న శంకుస్థాపన చేయనున్న ప్రధాని...

కులశేఖరపట్టణంలో ఇస్రో రెండవ ప్రయోగ వేదికకు ఈ నెల 28న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శంకుస్థాపన చేయనున్నారు. తూత్తుకుడి హార్బర్ ప్రాంగణంలో జరిగే కార్యక్రమంలో పాల్గొననున్న ప్రధాని, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పాల్గొననున్నారు. ఈ ప్రాజెక్ట్ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.950 కోట్లు కేటాయించగా, రెండేళ్ల పనులు నిర్మాణపనులు పూర్తిచేయాలని ఇస్రో నిర్ణయించింది.

ఆకట్టుకుంటున్న కళాఖండాలు

చెన్నై, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): 'ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంటీరియర్ డిజైనర్స్ (ఐఐఐడీ) సంస్థ రజతోత్సవ వేడుకల్లో భాగంగా నగరంలో ప్రముఖ కళాకారుడు, పద్మశ్రీ తోట తరణి కళాఖండాలతో ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేశారు. నుంగంబాక్కం కాలేజీరోడ్డులో వున్న అలియన్స్ ఫ్రాన్సైస్‌లో శనివారం ప్రారంభమైన ఈ ప్రదర్శన ఈ నెల 26వ తేదీ వరకు కొనసాగనుంది. ఈ ప్రదర్శనను తోట తరణితో పాటు జీఆర్‌టీ హోటల్స్ సీఈవో విక్రమ్ కోట, హంసధ్వని వైస్‌ప్రెసిడెంట్, ఫిక్కి ఫ్లో మాజీ సెక్రటరీ రచన కుమార్, ఆర్కిటెక్ట్ వంశీకృష్ణ, ఐఐఐడీ-సీఆర్‌సీ చైర్మన్ ఆర్‌పీఏ రవి, ఐఐఐడీ కార్యదర్శి ధర్మేష్ మెహతా తదితరులు ప్రారంభించారు. ఈ ప్రదర్శనను సందర్శకులు ప్రతిరోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 7 గంటల వరకు తిలకించవచ్చని నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.



ప్రదర్శన ప్రారంభోత్సవంలో ప్రముఖులు

గురునానక్ కాలేజీలో ముగిసిన సదస్సు

చెన్నై, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేళచ్చేరిలో గురునానక్ కాలేజీలో ఆరోగ్యం, ఆహారం, వ్యవసాయం, పర్యావరణ మేనేజ్‌మెంట్‌పై రెండురోజుల సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టీకే అవ్వై కొత్తై స్వాగతం పలుకగా, సిక్కింకు చెందిన ప్రతినిధి మంజిత్ సింగ్ నాయర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అదేవిధంగా తిరువళ్లువర్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ టి.ఆరుముగం, అన్నా యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ ఆర్.వేల్‌రాజ్, వివిధ రంగాలకు చెందిన ప్రతినిధులు డాక్టర్ రోషన్‌కుమార్, డాక్టర్ పి.అరుణ, డాక్టర్ సిన్నదురై, డాక్టర్ సోనం తాషి, డాక్టర్ జి.శేఖరన్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో అతిథులను సత్కరిస్తున్న నిర్వాహకులు

లయన్స్ క్లబ్‌లో ఘనంగా వేడుకలు

చెన్నై, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): 324 ఎం డిస్ట్రిక్ట్‌లోని లయన్స్ క్లబ్ ఆఫ్ సౌత్ సిటీలో శుక్రవారం సాయంత్రం 'చార్టర్ నైట్ సెలబ్రేషన్స్' జరిగాయి. స్థానిక మౌంట్‌రోడ్డులోని ఎస్‌వీఎస్ క్లబ్‌లో జరిగిన ఈ వేడుకలకు అధ్యక్షులు డాక్టర్ అల్లిరాణి, కార్యదర్శి డాక్టర్ ఏవీ శివకుమారి, కోశాధికారి రుక్మిణి నేతృత్వం వహించారు. ముఖ్య అతిథిగా 2వ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ బోస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలను కొనియాడారు. సభ్యులు లక్ష్మీ మోహన్‌రావు, వైజు ముక్కాల పర్యవేక్షణలో ఈ వేడుకలు జరిగాయి.



వేడుకల్లో ప్రముఖులు

'స్టార్టప్ టీఎన్ చెన్నై హబ్' ప్రారంభం



హబ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి ఉదయనిధి

చెన్నై, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక నందనంలోని సీఎంఆర్ఎల్ భవనంలో ఏర్పాటైన 'స్టార్టప్‌టీఎన్ చెన్నై హబ్‌'ను రాష్ట్ర యువజన, క్రీడాభివృద్ధి శాఖ మంత్రి ఉదయనిధి శనివారం ప్రారంభించారు. చెన్నై వెలుపలి స్టార్టప్‌లు తమ సందర్శనల సమయంలో వర్క్ స్పేస్ కోసం వెతికేటప్పుడు ఎదుర్కొనే సవాళ్లను పరిష్కరించేందుకు ఉద్దేశించబడినదే ఈ 'స్టార్టప్‌టీఎన్ చెన్నై హబ్'. ఈ కార్యక్రమంలో ఇంకా రాష్ట్ర చిన్నతరహా పరిశ్రమల శాఖ మంత్రి టీఎం అన్బరసన్, ఆ శాఖ కార్యదర్శి అర్చనా పట్నాయక్, మిషన్ డైరెక్టర్ శివరాజ రామనాధన్ తదితరులు పాల్గొన్నారు.

పితృతర్పణాల కోసం కడలూరు సిల్వర్‌బీచ్‌కు పోటెత్తిన జనం

చెన్నై, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మాసి మఖం సందర్భంగా పితృదేవతలకు తర్పణాలు వదిలేందుకు వచ్చినవారితో కడలూరు సిల్వర్‌బీచ్ కిక్కిరిసిపోయింది. తమిళ మాసమైన మాసి నెలలో మఖ నక్షత్రం, పౌర్ణమి పర్వదినాన్నే మాసిమఖంగా పిలుస్తున్నారు. ఈ యేడాది మాసిమఖ తీర్థవారి వేడుకలు రాష్ట్రంలోని సుప్రసిద్ధ ఆలయాల్లో శనివారం నిర్వహించారు. అదే సమయంలో కడలూరు సిల్వర్ బీచ్ వద్ద మాసిమఖం సందర్భంగా పితృదేవతలకు తర్పణాలు సమర్పించేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు గుమికూడారు. కడలూరు పరిసరాల్లోన్ని ఆలయాల ఉత్సవమూర్తులను ఊరేగింపుగా సముద్రతీరానికి తీసుకువచ్చారు. అదే సమయంలో ప్రజలు తమ పితృదేవతలకు తర్పణాలు సమర్పించారు.



సిల్వర్‌బీచ్ వద్ద గుమికూడిన ప్రజలు

చిత్రజ్యోతి

దర్శకుడిగా విజయ్ తనయుడు

అగ్రహీరో విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ మెగాఫోన్ పట్టారు. ఆయన దర్శకత్వం వహించే తొలి చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ నిర్మించనుంది. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఇందులో నటించేందుకు విజయ్ సేతుపతి, కవిన్‌లతో సంప్రదించినట్టు వార్తలు వచ్చాయి. కానీ, ఇపుడు ఈ చిత్రంలో మలయాళ సూపర్‌స్టార్ మమ్ముట్టి తనయుడు, హీరో దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా నటింపజేసేందుకు చర్చలు జరుగుతున్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. ఈ సినిమాకు యువన్ శంకర్ రాజా సంగీతం అందించనున్నారు కాగా, దుల్కర్ సల్మాన్ మలయాళ నటుడైనప్పటికీ.. తన నటనతో భాషా సరిహద్దులను చెరిపివేశారు. మలయాళం, తెలుగు, తమిళం, హిందీ ఇలా అన్ని భాషల్లో నటిస్తున్నారు. ఆ కోవలోనే జాసన్ సంజయ్ దర్శకత్వం వహించే తొలి చిత్రంలో దుల్కర్‌ను తీసుకోనున్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన విడుదలకానుంది.



జాసన్ సంజయ్

వంద థియేటర్లలో 'కో' రీ-రిలీజ్

హీరో జీవా - కార్తీకా జంటగా నటించి 2011లో విడుదలైన 'కో' చిత్రం మరోమారు ప్రేక్షకుల ముందుకురానుంది. మార్చి ఒకటో తేదీన ఈ చిత్రాన్ని వంద థియేటర్లలో రీ-రిలీజ్ చేస్తున్నారు. కేవీ ఆనంద్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని కేఆర్ ఇన్ఫోటైనమెంట్ బ్యానరుపై నిర్మాత ఎల్రెడ్ కుమార్ తెరకెక్కించారు. జీవా, కార్తీకాలతో పాటు అజ్మల్, ప్రకాష్ రాజ్, కోటా శ్రీనివాసరావు, బోస్ వెంకట్, జగన్ తదితరులు ఇతర పాత్రలను పోషించారు. హారీస్ జయరాజ్ సంగీతం సమకూర్చగా, రూ.20 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం రూ.50 కోట్లకుపైగా వసూలు చేసింది. రాజకీయాలతో కూడిన యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందించారు. ఇదేవిషయంపై నిర్మాత ఎల్రెడ్ కుమార్ మాట్లాడుతూ, 'మా బ్యానరుపై నిర్మించిన చిత్రాల్లో 'కో' ఓ మంచి చిత్రంగా నిలిచింది. ప్రేక్షకుల ఆదరణతో పాటు కమర్షియల్‌గా కూడా హిట్ అయింది. దీనికి కారణంగా హీరో యాక్షన్‌తో కేవీ ఆనంద్ దర్శకత్వం, హారీస్ జయరాజ్ సంగీతం చిత్రం విజయానికి కారణం. అందుకే ఈ మూవీని రీ-రిలీజ్ చేస్తున్నట్టు తెలిపారు.



'కో' మూవీలో జీవా - కార్తీక

ధీరజ్ హీరోగా యాక్షన్ ఫాంటసీ చిత్రం 'డబుల్ టక్కర్'

ఏర్‌ఫ్లిక్ సంస్థ నిర్మాణ సారథ్యంలో, మీరా మహతి దర్శకత్వంలో, విద్యాసాగర్ సంగీతం సమకూర్చగా, భారతదేశంలోనే తొలిసారిగా యానిమేషన్ పాత్రలతో కలిసి డాక్టర్ ధీరజ్, స్మృతి వెంకట్, కోవై సరళ, ఎంఎస్ భాస్కర్ తదితరులు నటించిన ఫాంటసీ యాక్షన్ చిత్రం 'డబుల్ టక్కర్'. సాలిగ్రామంలోని ప్రసాద్‌ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈ చిత్ర తారాగణం, సాంకేతిక నిపుణులతో కలిసి దర్శక నటుడు మిష్కిన్ కూడా పాల్గొన్నారు. చిత్ర నిర్మాతల్లో ఒకరైన చంద్రూ మాట్లాడుతూ... మూడేళ్ల క్రితం అపనమ్మకంతో వైరాగ్యంతో కొట్టుమిట్టాడుతున్న తనను హీరో ధీరజ్ ఆదుకుని స్క్రీన్ ప్లే విభాగంలోకి తీసుకొచ్చారని, మూడేళ్లు శ్రమించి పటిష్ఠమైన స్క్రీన్‌ప్లే రూపొందించానని చెప్పారు. డబుల్ టక్కర్ చిత్రం విడుదలైన తర్వాత తమిళ కార్టూన్ చిత్రాలకు మోజు పెరగటం ఖాయమన్నారు. ఈ ప్రాజెక్టులో పాలుపంచుకోవడం తనకెంతో ఆనందంగా ఉందన్న హీరోయిన్ స్మృతి వెంకట్ దర్శకుడు మిష్కిన్‌కు ధన్యవాదాలు తెలిపారు. డైరెక్టర్ మీరా మహతి చాలా కూల్ అయిన డైరెక్టర్ అని, ఈ చిత్ర కథాగమనం పూర్తిగా ఎలాంటి టెన్షన్ లేకుండా సాఫీగా సాగుతుందని, ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటుందని చెప్పారు. తన నటనకు సీనియర్ నటి కోవై సరళ మెరుగులుదిద్దారని తెలిపారు. డైరెక్టర్ మీరా మహతి మాట్లాడుతూ... 12 యేళ్లుగా కఠోర శ్రమ తర్వాతే దర్శకురాలిగా తెరముందుకు వచ్చానని చెప్పారు. షైమ్‌గోపీ సాయంతో హీరో ధీరజ్ పరిచయమయ్యారని, కథ చెప్పగానే ఆయన చాలా సంతోషించారని తెలిపారు. ప్రారంభించేటప్పుడు ఈ చిత్రం లోబడ్జెట్‌గా ఉండేదని, అయితే యానిమేషన్ పాత్రలతో తీయటం వల్ల భారీ బడ్జెట్ చిత్రంగా అందరినీ ఆకట్టుకునేలా తయారైందన్నారు. ముఖ్య అతిథి, దర్శకుడు మిష్కిన్ మాట్లాడుతూ.. ధీరజ్ అంటే తనకు చాలా ఇష్టమని, ఇప్పటివరకూ డాక్టర్‌గా సుమారు 500 మంది ప్రాణాలను కాపాడి ఉంటారని, ఆయన ఓ హార్ట్ స్పెషలిస్ట్ అని, ముఖ్యమంత్రి వైద్యబృందంలో ధీరజ్ కూడా ఉన్నారని, మంత్రి ఉదయనిధికి అత్యంత సన్నిహితుడని తెలిపారు. ధీరజ్ కోసమే తన చిత్రం షూటింగ్ రద్దు చేసుకుని మరీ ఈ ప్రెస్‌మీట్‌కు విచ్చేశానని చెప్పారు. హీరో ధీరజ్ మాట్లాడుతూ... దర్శకుడు మిష్కిన్ మాటలు తనను చాలా సంతోషపరిచాయని, చంద్రూ తన తొలిచిత్రం దర్శకుడని, సినిమాలకు సెన్సిటివ్ అంశాలతోపాటు ఎలాంటి కమర్షియల్ అంశాలుండాలో ఆయనకు బాగా ఎరుక అని చెప్పారు. 'పిళ్ళయార్ సుళి' సినిమా షూటింగ్‌లో ఉన్నపుడు డైరెక్టర్ మీరా కథ చెప్పటానికి వచ్చారని, ఐదు నిమిషాల్లో కథ చెప్పి నన్ను ఇంప్రెస్ చేయగలవా? అని అడిగానని, చివరకు నాన్‌స్టాప్‌గా నవ్విస్తూ కథ చెప్పి ఇంప్రెస్ చేశారని పేర్కొన్నారు. కథ బాగా నచ్చటంతో ఈ ప్రాజెక్ట్‌కు ఒకే చెప్పానని తెలిపారు. హీరోయిన్ స్మృతి వెంకట్‌కు, సంగీత దర్శకుడు విద్యాసాగర్‌కు, ఎడిటర్ వెట్రికి, ధన్యవాదాలు తెలియజేశారు. ఇక ఈ చిత్రాన్ని ప్రతి ఇంటి కుటుంబీకులు వీక్షించే బాధ్యతను పాత్రికేయ మిత్రులపై పెడుతున్నానని చెప్పారు.



ధీరజ్, స్మృతి వెంకట్

'వనంగాన్'లో కన్నడ నటికి ఛాన్స్

సుదీర్ఘకాలం తర్వాత ప్రముఖ దర్శకుడు బాలా తెరకెక్కిస్తున్న చిత్రం 'వనంగాన్'. ఇందులో కన్నడ నటి రోషిణికి అవకాశం కల్పించారు. గతంలో వచ్చిన 'ఏమాలి' చిత్రం ద్వారా కోలీవుడ్‌కు పరిచయమైన ఈమె చిత్రపరిశ్రమలోకి వచ్చి ఎనిమిదేళ్ళు అయింది. ఈ కాలంలో దాదాపు పది చిత్రాల్లో మాత్రమే నటించారు. సుదీర్ఘ కాలం తర్వాత తమిళ చిత్రంలో నటించారు. చాలాకాలం తర్వాత దర్శకుడు బాలా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో ఆమెకు అవకాశం ఇవ్వడంపై పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఆ పాత్రకు అంత ప్రాధాన్యత సినిమా విడుదలయ్యాక తెలియాల్సిందే. కాగా, ప్రముఖ నిర్మాత సురేష్ కామాక్షి తన సొంత నిర్మాణ సంస్థ 'వి' హౌస్ ప్రొడక్షన్స్‌పై నిర్మిసున్నారు. ప్రధాన పాత్రల్లో సముద్రఖని, మిష్కిన్, షణ్ముగరాజన్ తదితరులు నటించారు. కాగా, ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌కు మంచి స్పందన వచ్చింది. తాజాగా టీజర్‌ను రిలీజ్ చేయగా కేవలం 24 గంటల్లో 4 మిలియన్ వ్యూస్ వచ్చాయి. ప్రస్తుతం ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ పనులను శరవేగంగా జరుపుకుంటుంది. ఏప్రిల్‌లో విడుదల చేసేలా ప్లాన్ చేసిన ఈ చిత్రంలో అరుణ్ విజయ్ హీరోగా నటిస్తున్నారు.



'వనంగాన్'లో అరుణ్ విజయ్ - రోషిణి ప్రకాష్